
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
5
గురువారం 5 సెప్టెంబరు 2024



కరెంటు కష్టాలకు చెక్!

సాంకేతికత వైపు విద్యుత్ శాఖ అడుగులు



- సైదీ, సైఫీ సిస్టమ్స్‌కు శ్రీకారం
- ప్రతి సమస్యకూ ఆన్‌లైన్‌లోనే పరిష్కారం
- తగ్గనున్న నష్టాలు.. కష్టాలు
- వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్!



భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 4: విద్యుత్ శాఖ ఆధునీకత వైపు పయనం ప్రారంభించింది. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని పునికిపుచ్చుకుంది. విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టడమే కాకుండా వినియోగదారులకు నాణ్యమైన కరెంటు సరఫరా అందించేందుకు తెలంగాణ రాష్ట్ర నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీ ఎన్‌పీడీసీఎల్) కొత్త టెక్నాలజీకి శ్రీకారం చుట్టింది. ఇందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. తద్వారా సాంకేతిక లోపాలను ఎప్పటికప్పుడు సరిచేయడమే కాకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించొచ్చని అధికారులు అంటున్నారు.

వినియోగదారులకు అత్యుత్తమ సేవలు

విద్యుత్ వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించడానికి సాంకేతిక పద్ధతులు అవలంబిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా సైది (సిస్టం యావరేజ్ ఇంటరాప్షన్ డ్యూరేషన్ ఇండెక్స్), సైఫీ (సిస్టం యావరేజ్ ఇంటరాప్షన్ ఫ్రీక్వెన్సీ ఇండెక్స్) అనే పద్ధతులను ప్రవేశపెట్టారు. తద్వారా విద్యుత్‌ను సరఫరా, వినియోగం తదితర ప్రమాణాలను తెలుసుకోవచ్చని అంటున్నారు. విద్యుత్ సరఫరాలో ఎన్ని అంతరాయాలు జరిగాయి.. ఎంత సమయంపాటు అవి కొనసాగాయి? తదితర అంశాలతో రియల్‌టైం డేటాను క్రోడీకరిస్తారు. ఈ గణాంకాల ఆధారంగా విశదీకరించి అంతరాయాలు కలకుండా సత్వర చర్యలు చేపడతారు. దీంతో విద్యుత్ అంతరాయాలు కనిష్ఠస్థాయికి తీసుకురావచ్చని ఆ శాఖ అధికారులు అంటున్నారు.

అంతా యాప్‌లోనే...

విద్యుత్ సమస్యల పరిష్కారమే కాకుండా నాణ్యమైన కరెంటును అందించేందుకు 'టీజీఎన్‌పీడీసీఎల్ యాప్' అందుబాటులోకి వచ్చింది. దీని ద్వారా నేరుగా వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి ఆ సమస్యకు చెక్ పెడతారు. విద్యుత్ అంతరాయాలను సైతం వెంటనే పరిష్కరిస్తారు.. పనులు ఆలస్యం కాకుండా సకాలంలో పూర్తికావడానికి ఈ యాప్ ఎంతో దోహద పడుతుందని నిపుణులు చెబుతున్నారు. గతంలోలాగా పేపర్‌తో పనిలేకుండా అధికారులు సైతం ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు మెసేజ్‌ల రూపంలో రిపోర్టు చేయొచ్చని అంటున్నారు. దీని ద్వారా క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది సమయం కూడా ఆదా అవుతుందని పేర్కొంటున్నారు. ఈ యాప్‌ను మరింత అప్‌డేట్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. డిస్కమ్‌లకు సంబంధించిన ప్రతి సమాచారాన్నీ ఇందులోనే చూసేలా రూపొందించనున్నారు. దీని ద్వారా వర్క్‌ఫోర్స్ మేనేజ్‌మెంట్, ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం, డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్, వినియోగదారుల పోర్టల్, సిటిజన్ మేనేజ్‌మెంట్, అస్సెట్ మేనేజ్‌మెంట్ సమగ్ర వివరాలు తెలుసుకునే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. బిల్లింగ్, కలెక్షన్, అంతరాయాలు, ఫిర్యాదుల వివరాలు, కమాండ్ కంట్రోల్.. ఇలా ఒకేచోటా ప్రతి సమాచారాన్నీ ఇందులోనే తెలుసుకునే సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఎక్కడా ఎలాంటి అంతరాయాలు, లోటుపాట్లు ఉన్నా వెంటనే తెలిసిపోతుందని అంటున్నారు.

లోవోల్టేజీ నివారణకు కెపాసిటర్ బ్యాంకులు

లోవోల్టేజీ నివారణకు కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ఇది రైతులకు ఎంతోమేలు చేస్తాయని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు. మోటార్లు వినియోగించే సమయంలో ఒకవేళ లోవోల్టేజీ వస్తే వెంటనే ఈ కెపాసిటర్లు విద్యుత్‌ను మెరుగుపరచడంలో దోహదం చేస్తాయని తెలిపారు. దీంతో టెక్నికల్ నష్టాలు కూడా తగ్గుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ పంప్‌సెట్లకు, పారిశ్రామిక ఫీడర్లకు కలిగే నష్టాలను ఇది నివారిస్తుంది. వర్షాలు, ఈదురుగాలులు, సాంకేతికతంగా విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు ప్రత్యామ్నాయ సరఫరా అందించడం వల్ల వినియోగదారులు సంతృప్తిగా పనులు చేసుకోగలుగుతారని చెబుతున్నారు. దీని కోసం 33కేవీ, 11కేవీ ఇంటర్‌లింకుల పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. దీంతో అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్‌లో అన్ని స్తంభాలకు యూనిక్ పోల్ నంబర్లు పెయింటింగ్ ప్రక్రియను చేపట్టామని అంటున్నారు. పోల్స్ వారీగా పెట్రోలింగ్ సులభంగా చేపట్టొచ్చని చెబుతున్నారు. నిర్వహణను కూడా ట్రాక్‌చేసే వీలుటుందని తెలిపారు. గతంలో లాగా ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే ఆ లోకేషన్‌ను తెలుసుకుని, దానిని వెంటనే పరిష్కారం చేసుకోవచ్చని అంటున్నారు.

నాణ్యమైన విద్యుత్ కోసమే..

- మల్సూర్ నాయక్, విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ (భూపాలపల్లి)



వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంతో పాటు ఆధునిక సాంకేతికతతో ముందుకెళ్తున్నాం. దీని ద్వారా ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే పరిష్కారం చేసే వీలుంటుంది. గతంలో ఏదైనా సమస్య తలెత్తితే అక్కడికి సిబ్బంది వెళ్లేవారు. ఏదైనా పరికరాలు కావాలన్నా ఉన్నతాధికారులకు లెటర్లు పెట్టే పరిస్థితి ఉండేది. కానీ.. ఇప్పుడు ఆన్‌లైన్ సౌకర్యం అందుబాటులోకి రావడంతో సిబ్బంది సమయం వృథా కాకుండా సమస్య సులువుగా వెంటనే పరిష్కారమవుతుంది. పరిశ్రమలకు, వ్యవసాయ రంగానికి మెరుగైన విద్యుత్ అందుతుంది.

మేడారం అడవిలో
విపత్తుపై కేంద్రం స్పందించాలి

నిపుణులతో పరిశోధన చేయించాలి

సమ్మక్క, సారక్క దయతోనే ముప్పు తప్పింది

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



ములుగు, సెప్టెంబరు 4: తాడ్వాయి-మేడారం అటవీ ప్రాంతంలో సంభవించిన సుడిగాలులతో 200 హెక్టార్లలో వృక్షాలు నేల కూలిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించి సమగ్ర పరిశోధన చేయించాలని, ఇలాంటి విపత్తులు సంభవించే అవకాశాలున్న ప్రాంతాల ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. బుధవారం మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 31న భారీ వర్షం, ఈదురు గాలులకు తాడ్వాయి అటవీ ప్రాంతంలో లక్షల చెట్లు ధ్వంసం కావడం విస్మయ పరిచిందని తెలిపారు. ప్రమాద విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పందించి అడవి పునరుద్ధరణ, సంరక్షణ కోసం నిధులు మంజూరు చేయించాలని కోరారు. 'సుడిగాలులు అడవికే పరిమితమయ్యాయి.. పక్కనే ఉన్న శాపల్లి, కొండపర్తి, ఇందిరానగర్, నర్సాపూర్, తాడ్వాయి గ్రామాలకు విస్తరిస్తే ప్రమాదాన్ని ఊహించలేం.. మేడారం సమ్మక్క, సారలమ్మ దయతోనే ముప్పు తప్పిందని భవిస్తున్నాను'.. అని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం చొరవతో భారీ వర్షాల విపత్తును సమర్థంగా ఎదుర్కొన్నామని, క్షేత్ర స్థాయిలో సహాయక చర్యలను ముమ్మరంగా చేపట్టామని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ములుగు కలెక్టర్

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 4: జిల్లాలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలని కలెక్టర్ దివాకర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఐదురోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు జిల్లాలోని లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ తగిన సూచనలు చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో 24గంటలు పనిచేసేవిధంగా ఏటూరునాగారం ఐటీడీఏ, ములుగు కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూంలు ఏర్పాటు చేశామని, అవసరమైతే 1800 425 7109, 6309842395, 08717-293246 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ప్రమాదకరస్థాయిలో ఉన్న చెరువులు, వాగులు, కుంటల వద్దకు ప్రజలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, మత్స్యకారులు చేపలవేటకు వెళ్లకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వర్షాల వల్ల గోదావరి నీటి మట్టం పెరుగుతోందని, వరదల వల్ల ప్రభావితమయ్యే గ్రామాలు, రహదారుల గురించి ప్రజలకు సమాచారం చేరవేయాలని, రవాణా నియంత్రణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లా వైద్యాధికారి, వైద్యులు, సిబ్బంది గ్రామాలను సందర్శించి గ్రామస్థాయిలో పారిశుధ్య కార్యకలాపాలను పరిశీలించాలని, గర్భిణులను గుర్తించి వైద్యసేవలకు ఆస్పత్రులకు తరలించాలని ఆదేశించారు. జ్వరాలు, డెంగీ కేసులను గుర్తించి వైద్యసేవలు అందించాలని సూచించారు.

చెరువుల అన్యాక్రాంతంపై కలెక్టర్ ఆరా?

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 4: భూపాలపల్లిలో అన్యక్రాంతమైన చెరువుల అంశాన్ని కలెక్టర్ రాహుల్ శర్మ సీరియస్‌గా తీసుకున్నట్టు తెలుస్తోంది. 'శిఖం.. ఖతం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవాంం ప్రచురితమైన కథనంపై అయన ఆరా తీసినట్టు సమాచారం. ముఖ్యంగా మంజూర్‌నగర్‌లోని గోరంట్ల కుంట శిఖం ఆక్రమణలపై అయన దృష్టి సారించినట్లు తెలిసింది. గోరంట్లకుంట శిఖం భూమి ఉన్న సర్వేనెం 209ని సర్వేనెంబర్ 213గా నాలా కనర్వర్షన్ చేసి ల్యాండ్ ఎక్స్‌టెండ్ చేసిన వైనంపై కలెక్టర్ విస్మయం వ్యక్తం చేసినట్లు సమాచారం. చెరువు శిఖం కబ్జాపై పూర్తి వివరాలు అందించాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ క్రమంలో గోరంట్లకుంట శిఖం సహా జిల్లా కేంద్రంలో చెరువుల్లో వెలిసిన ఆక్రమణల తొలగింపుపై జిల్లా యంత్రాంగం రంగంసిద్ధం చేసినట్టు సమాచారం. మరోవైపు గోరంట్లశిఖంలో తెలియక భూములు కొనుగోలు చేసిన సామాన్యులు వెంచర్ నిర్వాహకులపై ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

ఇంటి గోడ కూలి వృద్ధురాలి మృతి





ప్రమాదంలో మరణించిన ఆగమ్మ (ఫైల్)

ములుగు, సెప్టెంబరు 4: భారీ వర్షానికి ఇంటిగోడ కూలి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ములుగు జిల్లాలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు మండలం భూపాల్‌నగర్ (పందికుంట)కు చెందిన సున్నం ఆగమ్మ (75) గ్రామంలోని ఓ చిన్న ఇంట్లో నివసిస్తోంది. భర్త వీరారెడ్డి, ఇద్దరు కుమారులు మరణించడంతో ఒంటరిగా జీవిస్తోంది. బుధవారం తెల్లవారుజామున నిద్రలో ఆమెపై గోడ కూలి పడటంతో తీవ్ర గాయాలై మృతి చెందింది. ప్రమాద విషయం తెలుసుకున్న తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీవో రామకృష్ణ, సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు భూపాల్‌నగర్‌కు వెళ్లారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఇంటిగోడ నిర్మాణంలో లోపాల కారణంగా సిమెంటు ఇటుకలు కూలిపడ్డాయని తహసీల్దార్, ఎంపీడీవో సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహాధర్నాకు తరలిన విద్యుత్ ఉద్యోగులు

గణపురం, సెప్టెంబరు 4: హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధా వద్ద చేపట్టిన మహాధర్నాకు కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఓసీ, బీసీ విద్యుత్ ఉద్యోగులు బుధవారం తరలివెళ్లారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 2014 నుంచి ప్రమోషన్స్ నష్టపోయిన ఓసీ, బీసీ ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని, సర్వీస్ రెగ్యులేషన్ ప్రకారం నేరుగా ఉద్యోగం సాధించిన వారికి సీనియారిటీ ప్రకటించాలని తదితర డిమాండ్లపై పలు సమస్యల పరిష్కారం కోసం మహాధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై జ్యూడిషియల్ కమిషనర్‌తో విచారణ జరిపి ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్‌ఈబీ రూల్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

ఎలక్ట్రిసిటీ జేఏసీ చైర్మన్‌గా రాజు



జేఏసీగా ఏర్పడిన విద్యుత్‌శాఖ సిబ్బంది

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 4: విద్యుత్‌శాఖలో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జేఏసీ ఏర్పాటైంది. బుధవారం కార్యవర్గాన్ని ఖరారు చేశారు. జేఏసీ చైర్మన్‌గా తిప్పారపు రాజు, కన్వీనర్‌గా మోత్కూరి కోటిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కోచైర్మన్ రాజయ్య, కోకన్వీనర్ కోసరి భాస్కర్, కోశాధికారిగా దాస్యపు స్వామి, సభ్యులుగా శ్రీధర్, విద్యాసాగర్, రామయ్య, మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

28న జాతీయ లోక్‌అదాలత్

వివరాలు 8వ పేజీలో

అభయారణ్యంలో
పీసీసీఎఫ్ పర్యటన

- చెట్లు కూలిన ప్రదేశాన్ని పరిశీలించిన దోబ్రియాల్
- సమగ్ర సర్వే చేయిస్తామని వెల్లడి



తాడ్వాయి- మేడారం మధ్య కూలిపోయిన చెట్లను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ దోబ్రియాల్

తాడ్వాయి, సెప్టెంబరు 4: ములుగు జిల్లా ఏటూరునాగారం వైల్డ్‌లైఫ్ రేంజ్‌లోని తాడ్వాయి-మేడారం అటవీ ప్రాంతంలో సుడిగాలి సృష్టించిన బీభత్సంతో వేలాది చెట్లు నేలకొరిగిన ప్రదేశాన్ని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) ఆర్.ఎం.డోబ్రియాల్ బుధవారం సందర్శించారు. అటవీశాఖ ఉన్నతాధికారులతో కలిసి ఆ ప్రాంతంలో కలియదిరిగారు. విరిగిపడ్డ భారీ వృక్షాలను పరిశీలించారు. ఆగస్టు 31న కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులకు 200హెక్టార్లలో సుమారు లక్ష చెట్లు కూలి పడ్డాయని స్థానిక అధికారులు ఆయన దృష్టికి తెచ్చారు. గడిచిన ఐదురోజులుగా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండగా తాడ్వాయి అటవీ ప్రాంతంలోనే ఈ విధ్వంసం జరగడమేమిటనే విషయమై ఆరా తీశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తన 37ఏళ్ల సర్వీసులో ఇలాంటి ఘటనను చూసింది లేదని తెలిపారు. చెట్లకు నేల పైభాగంలోనే కావాల్సిన పోషకాలు లభించ దంతో వేరు వ్యవస్థ నేలలోపలికి బలంగా వెళ్లలేదని, అందుకే బలమైన గాలులకు పెద్దమొత్తంలో కూలిపోయి ఉంటాయని అభిప్రాయపడ్డారు. మెట్రోలాజికల్ డిపార్ట్ మెంటు ద్వారా సర్వే చేపట్టి కారణాలను అన్వేషిస్తామన్నారు. సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని వెల్లడించారు. మరో పదిరోజుల్లో నష్టంపై పూర్తి సమాచా రం తెలుస్తుంద న్నారు. ఈప్రదేశంలో సహజంగానే చెట్లు పెరుగుతాయని, చాలావరకు సగం వరకు విరిపోయి తిరిగి పెరుగుతాయన్నారు. ఆయన వెంట కాళేశ్వరం, భద్రాద్రి కొత్తగూడెం సీసీఎఫ్‌లు ప్రభాకర్, భీమానాయక్, ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఎఫ్‌డీవో వజ్రారెడ్డి, ఎఫ్‌ఆర్‌వోలు సత్తయ్య, కృష్ణవేణి, అధి కారులు ఉన్నారు.

జీవవైవిధ్య పరిరక్షణకు శాశ్వత పరిష్కారం చూపాలి

వృక్ష శాస్త్రవేత్త సుతారి సతీష్





సుడిగాలి బీభత్సానికి కూలిన వృక్షాలు

ములుగు, సెప్టెంబరు 4: మానవ తప్పిదాల వలన పర్యావరణానికి జరుగుతున్న నష్టాన్ని అరికట్టాలని, ప్రమాదపుటంచున ఉన్న జీవవైవిధ్య పరి రక్షణకు శాశ్వత మార్గం చూపాల్సి ఉందని వృక్షశాస్త్రవేత్త డాక్టర్ సుతారి సతీష్ అభిప్రాయం వ్యక్తం చేశారు. తాడ్వాయి-మేడారం అటవీ ప్రాంతంలో సుడిగాలులకు లక్షలాది చెట్లు కూలిన ఘటనపై స్పందించిన ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రెండురోజుల క్రితం సంఘటనా స్థలిని పరిశీలించినట్లు తెలిపారు. ఇలాంటి సంఘటన కనీవినీ ఎరుగనిదని, భారీ వృక్షాలు కూకటివేళ్ల సహా నేలకూడటం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. అరుదైన వృక్ష జాతులకు చెందిన చెట్లకు నష్టం కలిగిందని, వాటి స్థానంలో నల్లమద్ది, తెల్లమద్ది, ఉసిరి, నారేప, మారేడు, ఇప్ప, సండ్ర, తెల్లతుమ్మ, బండారు, బుడదర్శి, మొ ర్రి, పాల, తీగమోదుగ, రేల, బూరుగ, బిల్లుడు, కొడిశ, జిట్రేడు, పచ్చరి, బాడిద, గరు గ, గుమ్మడి, టేకు, బొంగు, ఎగిస, జీడి, చిల్ల, విషముష్టి, చిలుకదుద్దు, తునిక్కాయ, కరక్కాయ, బొజ్జ వంటి దేశీయ, స్థానిక మొక్కలను నాటాల్సిన అవసరం ఉందని అభి ప్రాయపడ్డారు. యంత్రాలతో చదును చేస్తే విదేశీ జాతుల కలుపు మొక్కలు విస్తరించే ప్రమాదమని తెలిపారు. విధ్వంసం జరిగిన ప్రదేశంలో వన్యప్రాణులు, సరీసృపాలకు కూడా నష్టం జరిగి ఉంటుందని, దీనిపై పరిశీలన జరపాలని అధికారులను కోరారు.

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 4: సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు డీఈవో ముద్దమల్ల రాజేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి విశేష సేవలు అందించిన ఉపాధ్యాయులకు అవార్డులతో సత్కరించనున్నట్టు పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే...

జూకల్లుకు చెందిన పీజీ హెచ్‌ఎం కృష్ణ, మొగుళ్లపల్లి పీజీహెచ్‌ఎం సంజీవరెడ్డి, చిట్యాల మోడల్ స్కూల్‌కు చెందిన టీచర్ శ్రీకాంత్, నేతాజీ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్, చిట్యాల టీఎస్ఎంఎస్ పీజీటీ రాకేష్, భూపాలపల్లి, గొర్లవీడుకు చెందిన టీచర్ దేవదాసు, మహదేవపూర్‌కు చెందిన రాజయ్య, ఫ్రోబెల్ హైస్కూల్ కరస్పాండెంట్ యాదగిరి, నేరేడుపల్లి టీచర్ పద్మ, తాడిచర్ల టీచర్ శివలింగం, మొగుళ్లపల్లి నుంచి విజయభాస్కర్, మాంటిస్సోరీ హైస్కూల్ కరస్పాండెంట్ అనిల్‌కుమార్, మీనాజిపేట టీచర్ శ్రీనివాస్, పెద్దాపూర్‌కు చెందిన గిరిధర్, టీడబ్ల్యూఏహెచ్ఎస్ భూపాలపల్లికి చెందిన ఉపాధ్యాయిని అమల, శ్రీచైతన్య కరస్పాండెంట్ తిరుపతి, జడ్పీహెచ్ఎస్ కొంపల్లి టీచర్ అమరేందర్‌రెడ్డి, యూపీఎస్ లింగాల సత్యనారాయణ, మొగుళ్లపల్లికి చెందిన అనిల్‌కుమార్, శ్రీనారాయణ హైస్కూల్ కరస్పాండెంట్ స్రవంతి, మహదేవపూర్ ఎస్ఏ మధు, రంగయ్యపల్లి ఎస్ఏ సతీష్, మేదరమెట్ల ఎస్ఏ శ్రీనివాస్‌రెడ్డి, సువిధ కరస్పాండెంట్ శ్రీశైలం, జంగేడు ఎస్‌జీటీ స్వామి, బాగిర్తిపేట ఎస్‌జీటీ రమేష్, దబ్బగట్టు ఎస్‌జీటీ మహేష్, విశ్వదీప్తి కరస్పాండెంట్ సుదర్శన్, భూపాలపల్లి ఎస్‌జీటీ శైలజ, రాఘవరెడ్డిపేట ఎస్‌జీటీ రమేష్, బాగిర్తిపేట ఎస్‌జీటీ శ్రీలత, పీటర్‌బర్గ్ కరస్పాండెంట్ మాధురి, మాధారం ఎస్‌జీటీ రవి, రేగొండ సీఆర్‌పీ రాజమౌళి, కాటారం సీఆర్‌పీ శివశంకర్, విజ్ఞానజ్యోతి కరస్పాండెంట్ రాజబాబు, భవిత సెంటర్ ఐఈఆర్‌పీ రాజయ్య ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఇలా జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి 37 మందిని ఎంపిక చేశారు. వీరికి గురువారం ఘనంగా సన్మానంతో పాటు అవార్డును అందజేయనున్నట్లు డీఈవో రాజేందర్ తెలిపారు.

తగ్గుతూ.. పెరుగుతూ...

గంట గంటకూ మారుతున్న గోదావరి ఉధృతి

8లో

లక్ష్యంతో పనిచేశారు..
పట్టాలెక్కించారు

- మూడు రోజులపాటు నిరంతరాయంగా రైల్వేట్రాక్ మరమ్మతు పనులు
- 12 ఎక్స్‌కవేటర్లు, 11 టిప్పర్లు, 2 క్రేన్లు, వెయ్యిమంది సిబ్బంది
- ఇంటికన్నె వద్ద పూర్తి.. పర్యవేక్షించిన రైల్వే జీఎం
- మధ్యాహ్నం నుంచే పాక్షికంగా రైళ్ల పునరుద్ధరణ
- రైల్వేశాఖకు రూ.కోట్లలో నష్టం



కేసముద్రం మండలం ఇంటికన్నె వద్ద రైల్వేట్రాక్ మరమ్మతులు పూర్తి చేసిన ప్రాంతంలో ట్రయల్ రన్‌లో వెళుతున్న ప్రయాణికులు లేని సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్

వివరాలు 7వ పేజీలో..



ఈనెల 9 వరకు ఎన్పీడీసీఎల్‌లో సెలవులు రద్దు

హనుమకొండ, సెప్టెంబర్ 4: ఈనెల 9 వరకు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణశాఖ సూచించిన నేపథ్యంలో అప్పటి వరకు ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి వెల్లడించారు. అత్యవసరంగా కావాలనుకుంటే సీఈ (హెచ్‌ఆర్డీ అండ్ ట్రైనింగ్)కు సమాచారం ఇచ్చి అనుమతి పొందాలన్నారు. 16 సర్కిళ్ల ఎస్ఈలు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా పరిస్థితిని పరిశీలించాలన్నారు. 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. తగినంత సామగ్రి, సిబ్బంది, కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. ఎలాంటి అవసరం ఏర్పడినా కార్పొరేట్ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలన్నారు.

కొలిపాక శ్రీనివాస్‌కు రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు



వడ్డెపల్లి, సెప్టెంబరు 4 : హనుమకొండ పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ఆచార్య బత్తిని చంద్రమౌళి గౌడ్ తెలిపారు. అధ్యాపకులందరూ డాక్టర్ శ్రీనివాస్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి.సుహాసిని, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. అరుణ, కంప్యూటర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్‌బాబు తోపాటు అధ్యాపకులందరు డాక్టర్ శ్రీనివాస్‌ను అభినందించారు.

కమిషనరేట్‌లో ఐదుగురు ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 4: వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ బుధవారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. జి.దివ్య మడికొండ నుంచి వంగరకు, జి.రాజేష్ రెడ్డి నర్సంపేట నుంచి చెన్నారావుపేటకు, జి.అరుణ్ చెన్నారావుపేట నుంచి నర్సంపేటకు, ఎం.డి.ఫసియొద్దిన్ సీసీఎస్ నుంచి హనుమకొండ ట్రాఫిక్‌కు, ఎం.డి.యాకుబ్ కమిషనరేట్ నుంచి సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

'ఉత్తముల ఎంపిక సవ్యంగా జరగలేదు'

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: హనుమకొండ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక సవ్యంగా జరుగలేదని పలువురు ఉపాధ్యాయ సంఘ నేతలు ఆరోపణలు చేస్తున్నారు. ఎలాంటి ప్రామాణికత పాటించకుండా ఉత్తముల ఎంపికను జిల్లా విద్యాశాఖ నిర్వహించినట్లు టీయూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు నూతనకంటి బాబు ఒక ప్రకటనలో విమర్శించారు. ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను మాత్రమే ఉత్తములుగా ఎంపిక చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో అత్యధిక విద్యార్థులు ఉన్న పాఠశాలలు ప్రభుత్వ విభాగంలోనే ఉన్నాయని, అలాంటి పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయుల్లో చోటు దక్కకపోవడంపై ఆయన నిరసన వ్యక్తం చేశారు. నిబద్ధతతో పనిచేస్తున్న వారిని ఎంపిక చేయకుండా అధికారులు వారికి తోచిన విధంగా ఎంపిక చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలు గుర్తించడంలో జిల్లా విద్యాశాఖ పూర్తిగా విఫలమయ్యిందని మరో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆకుతోట శ్రీనివాస్‌లు నిరసన వ్యక్తం చేశారు.

మత్స్య అభివృద్ధి బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల జగదీశ్వర్ ప్రసాద్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రావుల జగదీశ్వర్‌ప్రసాద్

వడ్డెపల్లి, సెప్టెంబరు 4: తెలంగాణ ప్రాంతంలో ఆర్థికంగా వెనుకబడిన మత్స్యకారుల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు నిధులు మంజూరి చేసి వారి ఆర్థికాభివృద్ధి కోసం మత్స్య అభివృద్ధి బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావుల జగదీశ్వర్ ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సరిపోయినన్ని నిధులు కేటాయించి అసంఘటితరంగంలో కార్మికులుగా ఉన్న వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 8న ఉదయం 11 గంటలకు హనుమకొండ కేయూ - పెద్దమ్మగడ్డ రోడ్డులోని శారదా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ముదిరాజ్ మహాసభ రాష్ట్రస్థాయి సదస్సులో ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రావుల జగదీశ్వర్‌ప్రసాద్ కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల అధ్యక్షులు డాక్టర్ మౌటం కుమారస్వామి, వన్నాల కృపాసాగర్, ఏర్ల వెంకన్న, ఆకుల సుభాష్, సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ వెంకన్న, మహిళా నాయకురాలు లలిత, పిట్ట సురేష్ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

జాబ్ మేళా వాయిదా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: జిల్లా ఉపాధి కల్పనశాఖ ఆధ్వ ర్యంలో ఈనెల 6న నిర్వహించాల్సిన జాబ్‌మేళాను భారీ వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఉమారాణి బుధవా రం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారో ప్రకటన జారీ చేస్తామని ఆమె తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2902	2700
పల్లికాయ (సూక)	5300	5100
పల్లికాయ (పచ్చిది)	4500	3400
పెసళ్లు	6712	4552
పత్తి	7610	5000
పసుపు (కాడి)	--	--
పసుపు (గోల)	--	--
తేజ మిర్చి	12000	8000
తేజ ఏసీ	17500	14000
వండర్‌హాట్ ఏసీ	14500	13000
యూఎస్341 ఏసీ	14500	11000
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

పట్టభద్రులకు ఆర్‌బీఐ క్విజ్ పోటీలు

పట్టభద్రులకు ఆర్‌బీఐ క్విజ్ పోటీలు

ఆన్‌లైన్ ద్వారానే నమోదు

ఇద్దరు విద్యార్థులతో ఒక టీమ్

4 స్థాయిల్లో బహుమతుల ప్రదానం

వరంగల్ చౌరస్తా, సెప్టెంబరు 4: భారతీయ రిజర్వు బ్యాంకు ఏర్పాటై 90 సంవత్సరాలు పూర్తిచేసుకున్న నేపథ్యంలో పట్టభద్రులైన విద్యార్థులకు మేథాశక్తి పెంపొందించే విధంగా క్విజ్ పోటీలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. జాతీయ స్థాయిలో సాగే ఈ క్విజ్ పోటీలు రాష్ట్ర స్థాయి నుంచి దేశ స్థాయి వరకు జరుగనున్నాయి. మూడు దశల్లో జరిగే ఈ పోటీల్లో మూడు దశల్లో ఉత్తీర్ణులైన వారికి బహుమతుల ప్రదానం ఉంటుందని ఆర్‌బీఐ సూచించింది.

ఆన్‌లైన్ ద్వారా నమోదు

ఆర్‌బీఐ ఏర్పాటు చేసిన క్విజ్ పోటీల్లో పాల్గొనడానికి ఇద్దరు విద్యార్థులతో కూడిన ఒక టీంగా వెబ్‌సైట్ నందు పేరు నమోదు చేసుకోవాలి. ఈ రిజిస్ట్రేషన్ ఈనెల 17న రాత్రి 9 గంటల లోపు నమోదు చేసుకోవాలి.

ఆన్‌లైన్ పరీక్ష

ఆర్‌బీఐ క్విజ్ పోటీల్లో వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 19, 20, 21 తేదీల్లో ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. ఈ మూడు రోజుల్లో ఏదైనా ఒక రోజు పరీక్షలో పాల్గొనాలి.

వివిధ దశలు

ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొనే విద్యార్థులు పాస్ అయిన వారికి రాష్ట్ర స్థాయిలో మరో పరీక్ష ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో పాస్ అయిన వారికి జోనల్ (ఐదు రాష్ట్రాలు) కలిపి ఒక పరీక్ష ఉంటుంది. ఇందులో పాస్ అయిన వారికి జాతీయ స్థాయిలో పరీక్ష ఉంటుంది.

ఈ విద్యార్హతలు ఉండాలి

ఈ క్విజ్‌లో పాల్గొనే విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, పీహెచ్‌డీ చదువుతున్న విద్యార్థులై ఉండాలి. 25 సంవత్సరాల లోపు వారు మాత్రమే అర్హులు.

బహుమతుల వివరాలు

ఆన్‌లైన్‌లో నమోదై పరీక్ష రాసి రాష్ట్ర స్థాయిలో పాస్ అయిన వారికి ప్రథమ బహుమతిగా రూ.2లక్షలు, ద్వితీయ బహుమతి రూ.1 లక్షా 50వేలు, తృతీయ బహుమతి రూ.లక్ష .

జోనల్ స్థాయిలో పరీక్ష రాసిన వారికి పాస్ అయిన వారికి ప్రథమ బహుమతి రూ.5లక్షలు, ద్వితీయ బహుమతి రూ.4లక్షలు, తృతీయ బహుమతి రూ.3లక్షలు.

జాతీయ స్థాయిలో..

జాతీయ స్థాయిలో పరీక్ష రాసి పాస్ అయిన వారికి ప్రథమ బహుమతి రూ.10లక్షలు, ద్వితీయ బహుమతి రూ.8లక్షలు, తృతీయ బహుమతి రూ.6లక్షలు నగదు బహుమతిగా ఇవ్వబడును.


ప్రత్యేక పోర్టల్

ఆర్‌బీఐ 90 క్విజ్ సంబంధించిన వివరాలన్నీ ప్రతీ రోజు ఆర్‌బీఐ పోర్టల్‌లో తెలియజేయడం జరుగుతుంది. క్విజ్‌లో పాల్గొనే విద్యార్థులు ఈ పోర్టల్‌ను ప్రతీ రోజు చూడవచ్చు.

క్విజ్‌లో పాల్గొనండి..

రాజు, జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్

భారతీయ రిజర్వు బ్యాంకు ఏర్పాటై 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆర్‌బీఐ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నది.. ఇందులో వరంగల్ జిల్లాలోని పట్టభద్రులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా పేరు నమోదు చేసుకొని క్విజ్ పోటీల్లో పాల్గొనాలని కోరారు.







పంతం పట్టి.. పతకం కొట్టింది..

- పారాలింపిక్స్‌లో కాంస్యం సాధించిన 'పరుగుల సివంగి' దీప్తి
- పేద కుటుంబంలో పుట్టినా మొక్కవోని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం
- రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి అథ్లెట్



పర్వతగిరి, సెప్టెంబరు 4: పంతం పట్టి పతకాన్ని సాధించింది. ఇతరుల లాగా ఆలోచించలేకపోయినా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో తన లక్ష్యాన్ని చేరుకుంది. బరిలోకి దిగిన ప్రతీ పోటీలోనూ పతకమే లక్ష్యంగా దూసుకెళ్లింది. ప్రపంచ అత్యున్నత పోటీలైన పారాలింపిక్స్‌లో కూడా ఏ మాత్రం తడబడకుండా లక్ష్యం దిశగా దూసుకెళ్లి కాంస్య పతకాన్ని అందుకుంది. కాంస్య తన స్వగ్రామమైన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడను వార్తల్లో నిలిచేలా చేసింది. రాష్ట్రంలోనే ఈ ఘనత సాధించిన తొలి అథ్లెట్‌గా రికార్డుల్లో నిలిచింది.

పేద కుటుంబంలో జన్మించినా..

మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన జీవంజి ధనలక్ష్మి-యాదగిరి దంపతుల ప్రథమ పుత్రిక దీప్తి. గ్రామంలోని ఆర్డీఎఫ్ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తూ నాలుగో తరగతి నుంచే రన్నింగ్‌పై మక్కువ పెంచుకుంది. ఇంటి నుంచి పాఠశాలకు, పాఠశాల నుంచి ఇంటికి నడవడం కన్నా పరుగెత్తుతూనే వెళ్లేదని స్థానికులు చెబుతున్నారు. ఆమెలోని ప్రతిభను గుర్తించిన ఆర్డీఎఫ్ ఫౌండర్ మెంబర్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు క్రీడల వైపు మళ్లించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కోచ్ ద్వారా ప్రత్యేక తర్ఫీదునిస్తూ ప్రోత్సహించారు. అథ్లెటిక్స్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో 2016లో పాఠశాల స్థాయిలోనే 'సాయ్'లో శిక్షణకు ఎంపికైంది. శిక్షణ తీసుకుంటూ అక్కడే విద్యాభ్యాసం కొనసాగిస్తోంది.



పారాలింపిక్స్‌లో పతకంతో జివంజి దీప్తి

అవమానాలు ఎదురైనా..

ఇతర అమ్మాయిల మాదిరిగా కాకుండా కొంత భిన్నంగా ఉండడంతో పలువురు హేళన చేసేవారు. అబ్బాయిల లక్షణాలే అధికంగా ఉన్నాయని సూటిపోటి మాటలతో వేధించేవారు. వాటిని పట్టించకోకుండా పాల్గొన్న ప్రతీ పోటీలోనూ పతకమే తన లక్ష్యంగా ముందుకు సాగింది. విమర్శలన్నింటికీ నోటితో గాకుండా పరుగుతోనే సమాధానం చెప్పింది. కూతురును జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి పంపించడానికి గాను కూలీ పనులు చేసుకునే తల్లిదండ్రులు తమకున్న ఎకరం పొలాన్ని సైతం అమ్మేశారు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబంలో పుట్టిన దీప్తి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టింది.

బరిలోకి దిగితే పతకమే..!

చిరుత వేగంతో దూసుకెళ్లే దీప్తి బరిలోకి దిగితే ఖచ్చితంగా పతకం వచ్చి తీరాల్సిందే. పోటీలో నిలిచిన ఇతర క్రీడాకారులను వెనక్కి నెట్టి మరీ పరుగు పందెంలో ముందుకు దూసుకెళ్తుంది. ఆమెలోని వేగాన్ని గుర్తించిన 'సాయ్' అకాడమీ కోచ్ నాగపురి రమేష్ ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. ఒకవైపు చదువు కొనసాగిస్తూనే పరుగుపై దృష్టి సారించింది. మెరుగులు దిద్దితే పల్లెల్లోనూ ఆణిముత్యాలు తయారవుతారనడానికి దీప్తి విజయాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ప్రధాని, సీఎం అభినందనలు



ప్రధాని ట్వీట్



సీఎం ట్వీట్

పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవంజి దీప్తికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ, పర్వతగిరి మండలానికి చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు తదితరులు దీప్తికి ట్విటర్ (ఎక్స్)లో అభినందనలు తెలిపారు. విశ్వవేదికపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించిన దీప్తి ప్రస్థానం స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా

- 2016లో 'సాయ్' అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నప్పటి నుంచి దీప్తి పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధిస్తోంది.
- 2016లో కరీంనగర్‌లో జరిగిన జూనియర్ సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లు, 200 మీటర్లలో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించింది. తమిళనాడులో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లలో 5వ స్థానం, 200 మీటర్లలో 6వ స్థానం సాధించింది.
- 2017లో కేరళలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100, 200 మీటర్లలో గోల్డ్‌మెడల్. గుంటూరులో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 200 మీటర్లు, 400 మీటర్లలో గోల్డ్‌మెడల్.
- 2018లో రాంచీలో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లు, 200 మీటర్లలో గోల్డ్‌మెడల్.
- 2019లో ఛత్తీస్‌గడ్‌లో జరిగిన యూత్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 100 మీటర్లు, 200 మీటర్లలో గోల్డ్‌మెడల్. మహారాష్ట్రలో జరిగిన ఖేలో ఇండియా నేషనల్ చాంపియన్‌షిప్‌లో 100, 200 మీటర్లలో సిల్వర్ మెడల్. కర్ణాటకలోని ఉడిపిలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లు, 200 మీటర్లలో గోల్డ్ మెడల్ సాధించడమే గాకుండా 100 మీటర్లలో న్యూ మీట్ రికార్డును సృష్టించింది. గుంటూరులో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లలో గోల్డ్ మెడల్, 200 మీటర్లలో సిల్వర్ మెడల్. పంజాబ్‌లో జరిగిన నేషనల్ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లలో గోల్డ్ మెడల్, 200 మీటర్లలో సిల్వర్ మెడల్.
- అంతర్జాతీయ స్థాయిలో హాంగ్‌కాంగ్‌లో జరిగిన ఏషియన్ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 200 మీటర్లలో కాంస్య పతకం, మిడ్లే రిలేలో రజత పతకం సాధించింది. మొరాకోలో జరిగిన పారా ఏషియా పోటీల్లో 400 మీటర్ల విభాగంలో, జపాన్‌లో జరిగిన నేషనల్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించి పారాలింపిక్స్‌లో అర్హత సాధించింది.
- ప్రస్తుతం పారాలింపిక్స్‌లో కాంస్య పతకంతో మెరిసింది.



కోచ్ నాగపురితో దీప్తి

నా కల సాకారమైంది..

నాగపురి రమేష్, సాయ్ అకాడమీ కోచ్

ప్రతీ కోచ్‌కు తన శిష్యులు ప్రపంచంలోనే అత్యున్నతమైన ఒలింపిక్స్‌లో పతకం సాధించాలని కల ఉంటుంది. ఆ కల నాకు దీప్తి ద్వారా సాకారమైంది. నాకే పతకం వచ్చినంత సంతోషంగా ఉంది. ఇటీవల జరిగిన ఒలింపిక్స్‌లో తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్క పతకం కూడా లేకపోవడం కొంత ఆవేదన మిగిల్చింది. దాన్ని భర్తీ చేస్తూ దీప్తి పారాలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని కొల్లగొట్టింది. నార్మల్‌గా ఉన్న వ్యక్తులకు శిక్షణనివ్వడం ఎవరికైనా సాధ్యమే కానీ, దీప్తి లాంటి అథ్లెట్‌కు శిక్షణనివ్వడం అనేది సవాళ్లతో కూడుకున్న పని. ఎనిమిదేళ్ల కఠోరసాధనతో ఇది సాధ్యమైంది.

మాజీ మంత్రి ఎర్రబెల్లి అభినందనలు

రాంనగర్: ఒలంపిక్ అథ్లెట్‌లో కాంస్య పతకం సాధించిన దీప్తి జీవాంజికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అభినందనలు తెలిపారు. పతకం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జీవాంజి తల్లిదండ్రులకు బుధవారం ఫోన్ చేసి అభినందించారు. పారిస్ ఒలంపిక్ అథ్లెట్‌లో దీప్తి జీవాంజి కాంస్య పతకం సాధించడం యావత్ దేశానికి, తెలంగాణకు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు గర్వకారణమని ఈ సందర్భంగా దయాకర్‌రావు కొనియాడారు.

దీప్తి సాధించిన పతకాలతో తల్లిదండ్రులు



అదృష్టంగా భావిస్తున్నాం..

జీవంజి ధనలక్ష్మి, యాదగిరి (దీప్తి తల్లిదండ్రులు)

అవలక్షణాలతో పుట్టిన పిల్లలను తల్లిదండ్రులు దురదృష్టంగా భావిస్తుంటారు. కానీ, దీప్తి మాకు జన్మించడం మా అదృష్టంగా భావిస్తున్నాం. పరుగు పందెంలో పాల్గొనడానికి గాను మా సర్వస్వం ధారపోశాం. మా నమ్మకాన్ని నిలబెట్టింది.

లక్ష్యంతో పనిచేశారు.. పట్టాలెక్కించారు..

యుద్ధ ప్రాతిపదికన 3 రోజులపాటు రైల్వేట్రాక్ మరమ్మతు పనులు

మధ్యాహ్నం నుంచే పాక్షికంగా రైళ్ల పునరుద్ధరణ

కేసముద్రం, సెప్టెంబరు 4 : భారీ వర్షం సృష్టించిన బీభత్సంతో సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె, తాళ్లపూసలపల్లి వద్ద రైల్వేట్రాక్ ధ్వంసమైంది. దీంతో మూడు రోజులుగా రైళ్లరాకపోకలను పూర్తిగా నిలిపేశారు. ఈ విధ్వంసంతో పాటు రైళ్ల నిలిపివేతతో రైల్వేశాఖకు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. అయితే రైల్వే యంత్రాంగం ట్రాక్ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేసి.. రైళ్లను పునరుద్ధరించేందుకు ఓ లక్ష్యంతో పనిచేసింది. విజయవంతంగా మరమ్మతులు పూర్తి చేసి రైళ్లను పట్టాలెక్కించారు. కేసముద్రం - ఇంటికన్నె మధ్య 418 కిలోమీటరు వద్ద 40 మీటర్ల పొడవున రైల్వే ట్రాక్ ధ్వంసమైన ప్రాంతంలో మరమ్మతు పనులు తుదిదశకు చేరాయి. ఇదే మండలం తాళ్లపూసపల్లి- మహబూ బాబాద్ మధ్యన 432, 434 కిలోమీటరు వద్ద వరద తాకిడికి దెబ్బతిన్న సుమారు 30 మీటర్ల రైల్వే ట్రాక్‌ను మంగళవారం సాయంత్రమే మరమ్మతులు పూర్తి చేసిన విషయం తెలిసిందే. ఇంటికన్నె-కేసముద్రం మధ్యన కూడా మరమ్మతులు పూర్తి కావడంతో బుధవారం మధ్యాహ్నం నుంచే రైళ్ల రాకపోకలను పాక్షికంగా పునరుద్ధరించారు.



ఇంటికన్నె వద్ద పునరుద్ధరణ చేసిన రైల్వే అప్‌లైను ట్రాక్



ఇంటికన్నె వద్ద ఈనెల 1న ట్రాక్ కొట్టుకుపోగా వేలాడుతున్న పట్టాలు (ఫైల్)

మూడు రోజులుగా పనులు..

కేసముద్రం-ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య 418 కిలోమీటరు రాయి వద్ద సుమారు 40 మీటర్ల ట్రాక్, తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ మధ్య 432,434 కిలోమీటరు వద్ద సుమారు 30 మీటర్ల రైల్వేట్రాక్ వరద నీటికి కొట్టుకు పోయిన విషయాన్ని అక్కడే కాపలా ఉన్న ట్రాక్‌మెన్‌లు రైల్వే అధికారులకు సమాచారం అందించారు. దీంతో కేసముద్రం రైల్వేస్టేషన్‌లో బెంగళూరు-దానాపూర్ సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్‌డౌన్ వైపులా వెళ్లే రైళ్లు, మహబూబాబాద్‌లో సింహపురి ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోయాయి. తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ మధ్య ధ్వంసమైన ట్రాక్‌ను మంగళవారం సాయంత్రం వరకు పునరుద్ధరించి సిద్ధం చేశారు. ఇక ఇంటికన్నె వద్ద రైల్వేట్రాక్ బాగా ధ్వంసం కావడం, వరద ప్రవాహం ఉండడంతో మరమ్మతులకు భారీ యంత్రాంగం కృషి చేయాల్సివచ్చింది. ఆదివారం సాయంత్రం నుంచి రేయింబవళ్లు 12 ఎక్స్‌కవేటర్ యంత్రాలు, 11 టిప్పర్లు, 2 క్రేన్లు, ఒక రోడ్డు రోలర్‌తోపాటు 600 మంది కార్మికులు, ఇంజనీరింగ్, ఓహెచ్‌ఈ (ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్), ఎస్‌అండ్‌టీ (సిగ్నల్ అండ్ టెలికాం) సిబ్బంది, ఉన్నతాధికారులు వెయ్యి మందికిపైగా నిర్విరామంగా పనిచేశారు. సిబ్బందికి భోజనం, నీళ్లు అక్కడికే తీసుకువచ్చి అందించారు. మరమ్మతులు జరుగుతున్న ప్రాంతం అంతా ఒకపెద్ద క్వారీ పరిశ్రమలాగా కనిపించింది. నిరంతరం శ్రమించి ఎట్టకేలకు బుధవారం ఉదయం 10 గంటలకు అప్‌లైను ట్రాక్‌ను సిద్ధం చేశారు.

వేగంగా పునరుద్ధరణ పట్ల హర్షాతిరేకాలు..

ట్రాక్ పూర్తిగా వరద తాకిడికి కొట్టుకుపోయి రైలుపట్టాలు వేలాడుతున్న స్థితి నుంచి మూడురోజుల్లోనే పునరుద్ధరణ చేయడంపట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్రాక్ మీదుగా తొలుత ఒక గూడ్స్‌రైలును ఆ తర్వాత కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు లేకుండా మూడు రోజులుగా నిలిచి ఉన్న బెంగళూరు-దానాపూర్ సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌ను ట్రయల్‌రన్‌లో భాగంగా పంపించారు. మధ్యాహ్నం 2 గంటలకు గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను పంపించారు. అందుబాటులోకి వచ్చిన అప్‌లైనుపై గోల్కొండ, నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌లు, డౌన్‌వైపు హౌరా, గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లను కాషన్ ఆర్డర్‌తో నెమ్మదిగా నడిపించారు. రాత్రి వరకు డౌన్‌లైనును సిద్ధం చేసి గురువారం నుంచి అన్ని రైళ్ల రాకపోకలను పునరుద్ధరించే అవకాశమున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. మూడు రోజులుగా యుద్ధప్రాతిదికన చేపట్టిన ఈ మరమ్మతు పనులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అజయ్‌కుమార్ జైన్ ప్రత్యేక రైలులో పలుమార్లు ఇంటికన్నెకు వచ్చి సమీక్షించారు. ఇక దక్షిణమధ్య రైల్వే డీఆర్ఎం భరతేష్ కుమార్ జైన్ మూడురోజుల పాటు అక్కడే ఉండి పనులను పూర్తిగా పర్యవేక్షించారు. ఈ మరమ్మతులకు రూ.6కోట్లకుపైగా ఖర్చయినట్లు అంచనా వేస్తున్నారు. మూడు రోజులపాటు రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంవల్ల రైల్వేశాఖకు కోట్లలో నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం జరిగిన ట్రాక్ ధ్వంసమైన పరిస్థితి ప్రస్తుత మరమ్మతుల దృశ్యాలను పోల్చుతూ 'హ్యాట్సాఫ్ రైల్వే' అంటూ ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.

రాయనపాడు వద్ద వరదతో ఇబ్బందులు..

గిర్మాజీపేట, సెప్టెంబరు 4: భారీ వర్షాలు, వరదలతో సికింద్రాబాద్ - విజయవాడ మార్గంలోని తాళ్లపూసలపల్లి, ఇంటికన్నె మధ్య ట్రాక్ దెబ్బతినడంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోగా.. బుధవారం నాటికి మరమ్మతులు పూర్తవడంతో రైళ్లను పాక్షికంగా పునరుద్ధరించారు. అయితే విజయవాడ సమీపంలోని రాయనపాడు రైల్వేస్టేషన్ ఇంకా వరద ముంపులోనే ఉండటంతో పలు రైళ్లను వరంగల్ వైపు రాకుండా దారి మళ్లించారు. హైదరాబాద్-శాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.20గంటలకు వరంగల్‌కు చేరుకుని.. సుమారు 40 నిమిషాల తర్వాత విజయవాడ వైపు బయలుదేరింది. రాత్రి 7.30 గంటల వరకు కొండపల్లిలోనే నిలిచిపోయింది. వరంగల్ నుంచి పలువురు ప్రయాణికులు ఈ రైలులో విజయవాడ, విశాఖపట్టణం వెళ్లారు. ఆ రైలు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో అక్కడి నుంచి దారి మళ్లిస్తున్నట్లు సమాచారం. అలాగే సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు బయలుదేరిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను వరంగల్ రాకుండా నడికూడ మీదుగా గుంటూరుకు దారి మళ్లించారు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరాల్సిన గోదావరి, వందేభారత్ తదితర పలు రైళ్లను ఆలస్యంగా నడికూడ మీదుగా దారి మళ్లిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం గోల్కొండ, ఈస్ట్‌కోస్ట్ రైళ్లు వచ్చినపుడు వరంగల్ రైల్వేస్టేషన్‌లో కొద్దిసేపు ప్రయాణికుల సందడి కనిపించింది. అయితే రైళ్ల రద్దు, దారి మళ్లింపు సమాచారంతో ప్రయాణికుల సందడి తగ్గింది. రైల్వేస్టేషన్‌లోని హెల్ప్‌లైన్ సిబ్బంది ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నారు.

చదువుల దివిటీ.. గురువు..

● నేడు ఉపాధ్యాయ దినోత్సవం ● పాఠశాలలు, కళాశాలల్లో గురుపూజోత్సవం ● సన్మాన కార్యక్రమాలకు ఘనంగా ఏర్పాట్లు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: అజ్ఞానమనే చీకటిలో ఉన్నవారికి, విజ్ఞానమనే దారిని చూపి వారి జీవితాల్లో వెలుగులు నింపే దివిటీలు ఉపాధ్యాయులు. అలా అందరి జీవితాల్లో వెలుగులు నింపే టీచర్ల సేవలను గుర్తుచేసుకుంటూ ఏటా సెప్టెంబరు 5న దివంగత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రపంచ వ్యాప్తంగా అక్టోబరు 5న టీచర్స్‌డేను జరుపుకుంటుండగా, మన దేశంలో మాత్రం సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజున నిర్వహించుకోవడం జరుగుతోంది. భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతదేశ తొలి ఉపరాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా పని చేశారు. 1988లో తిరుత్తణిలో ఆయన జన్మించిన ఆయన యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ నుంచి ఫిలాసఫీలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. కోల్‌కతా, మైసూర్ యూనివర్సిటీలో ఆయన అధ్యాపకుడిగా పని చేశారు. చాలా మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ఏ రోజు తన పుట్టిన రోజును జరుపుకోవాలని కోరుకోలేదట. విద్యార్థులు ఎవరైనా పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తామని ఆయన్ను అడిగితే వద్దని వారించే వారట. విద్యార్థులు అంటే అమితమైన ఇష్టాన్ని ప్రదర్శించే ఆయన, విద్యార్థులు గురువుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని చెప్పేవారట. అందుకే 1962వ సంవత్సరం నుంచి ఆయన పుట్టిన రోజున అందరూ ఉపాధ్యాయులను గౌరవిస్తూ టీచర్స్ డే వేడుకలను జరుపుతున్నారు. నాడు మత ఆధ్యాత్మిక పునరుద్ధరణ వాదాన్ని అకడమిక్ తాత్వికస్థాయికి తీసుకువెళ్లిన గొప్ప పండితుడు సర్వేపల్లి రాధా కృష్ణన్. ఆయన 15 సార్లు నోబెల్ సాహిత్య బహుమతికి, 11 సార్లు నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు. ఈ క్రమంలోనే సర్వేపల్లి తనకు కృష్ణుడితో సమానమని జాతిపిత మహాత్మాగాంధీ కీర్తించారు. యుగపురుషుల గురించి ఉపన్యాసం ఇవ్వండి అని పిలిస్తే యుగపురుషుడే వచ్చారు అని సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఉద్దేశించి కీర్తించారట హోవెల్ అనే మహనీయుడు. అంతేకాదు తనలోని మామూలు మనిషిని దర్శించిన మహర్షి అంటూ సోవియట్ అధినేత స్టాలిన్ కూడా రాధాకృష్ణన్ గొప్పతనాన్ని చాటారు. అయితే గాంధీజీ మాటలను బట్టి ఆయన ఒక గీతాచార్యుడిగా, గొప్ప గురువుగా కీర్తించబడ్డారు. ఈనేపథ్యంలోనే భవిష్యత్ తరాలు ఆయన మార్గంలో పయనించాలని దిశానిర్దేశం చేస్తూ ఆయన పుట్టిన రోజును టీచర్స్ డే గా జరపాలని నాటి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నిర్ణయం తీసుకున్నారు.

కాగా, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు తమకు చదువుచెప్పే గురువులను ఘనంగా సత్కరించుకునేందుకు సిద్ధమవయ్యారు.

వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 'ఉత్తములు' వీరే..

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి పాఠశాల, ఇంటర్మీడియేట్ విద్యాశాఖల నుంచి మొత్తం ఐదుగురిని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది.

కొంక అనురాధ



వరంగల్ జిల్లాలోని రాయపర్తి మండలంలోని కొత్తూరు జడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. 2009లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయురాలుగా ప్రస్తుత సిద్ధిపేట జిల్లాలోని వేచరేణి జడ్పీహెచ్‌ఎస్‌లో ఉద్యోగం పొందారు. అక్కడ 3 ఏళ్లు పనిచేసిన అనంతరం ప్రస్తుత జనగామ జిల్లాలోని కామారెడ్డిగూడెం జడ్పీహెచ్‌ఎస్‌లో 2013 నుంచి 2015 వరకు, 2017 నుంచి 2022 వరకు చిట్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పనిచేశారు. జీవో నెం.317లో రాయపర్తి మండలంలోని కొత్తూరు జడ్పీహెచ్‌ఎస్‌కు వచ్చి ఇక్కడే పనిచేస్తున్నారు. స్కూల్లో కిచెన్ గార్డెన్, ఫ్లవర్ గార్డెన్, బొటానికల్ గార్డెన్‌ను ఏర్పాటు చేయడంలో కృషి చేయడంతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోంది.

కె.ఇందుమతి



కె.ఇందుమతి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1996లో నిర్వహించిన కాలేజ్ సర్వీస్ కమిషన్ పరీక్ష ద్వారా జువాలజీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాలోని తాటిపూడి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో చేరారు. అనంతరం 2001లో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు బదిలీపై వచ్చి ఇక్కడే ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

పి.సంపత్‌కుమార్



2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన కాలేజ్ సర్వీస్ కమిషన్ పరీక్షలో కెమిస్ట్రీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై ప్రస్తుత సిద్ధిపేట జూనియర్ కళాశాలలో ఉద్యోగంలో చేరారు. అక్కడ నుంచి 2011లో వరంగల్ జిల్లాలోని రంగశాయిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వర్తించారు. అనంతరం 2018 నుంచి 2021 వరకు వర్ధన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేశారు. ఇక్కడి నుంచి ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది ప్రస్తుతం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 2024లో బదిలీపై వరంగల్ జిల్లా నర్సంపేటలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రస్తుతం పనిచేస్తున్నారు.

జి.వెంకటయ్య



1983లో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ప్రస్తుతం సిరిసిల్ల జిల్లా జిల్లెల్ల జడ్పీహెచ్‌ఎస్‌లో ఉద్యోగంలో చేరారు. సిద్దిపేట జిల్లాలోని శనిగరం జడ్పీహెచ్‌ఎస్, కరీంనగర్‌లోని గొడిశాల జడ్పీహెచ్‌ఎస్‌లో 1996 వరకు ఎస్జీటీగా పనిచేశారు. అక్కడి నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది కరీంనగర్‌లోని సిర్సపల్లి యూపీఎస్‌లో పనిచేశారు. 2001లో జువాలజీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి పొంది వరంగల్ జిల్లాలోని ఫోర్ట్ వరంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరారు. 2017లో ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది ప్రస్తుత ములుగు జిల్లాలోని మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లారు. ప్రస్తుతం 2024 నుంచి వర్ధన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

డాక్టర్ ఎల్.కొమురారెడ్డి



డాక్టర్ ఎల్.కొమురారెడ్డి 2002లో హనుమకొండ జిల్లా చిన్నకోడెపాక జడ్పీహెచ్‌ఎస్‌లో హిందీ లాంగ్వేజ్ పండిట్‌గా ఉద్యోగంలో చేరారు. అక్కడ నుంచి 2011 బదిలీపై మనుగొండ యూపీఎస్‌లో పనిచేశారు. 2012లో కాలేజ్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన జూనియర్ లెక్చరర్ల పరీక్షలో ఉత్తీర్ణులై వరంగల్ జిల్లాలోని నెక్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా చేరారు. 2018లో బదిలీపై హసన్‌పర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లారు. అక్కడి నుంచి సాధారణ బదిలీల్లో 2024లో ప్రస్తుతం నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల (కోఎడ్యుకేషన్)లో విధులు నిర్వర్తిస్తున్నారు.

భూపాలపల్లి జిల్లాలో..

అమరేందర్‌రెడ్డి, రాజయ్య





భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 4: భూపాలపల్లి జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. భూపాలపల్లి మండలంలోని కొంపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో ఇంగ్లిష్ బోధిస్తున్న స్కూల్ అసిస్టెంట్ అమరేందర్‌రెడ్డి, మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు గూడెల్లి రాజయ్య అవార్డు అందుకోనున్నారు.

రజనీకాంత్



కాటారం: గిరిజన గురుకులాల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆడెపు రజనీకాంత్ ఎంపికయ్యారు. భూపాలపల్లి జిల్లా కాటారం గిరిజన సంక్షేమ బాలుర గురుకులంలో ఆర్ట్అండ్ క్రాఫ్ట్ టీచర్‌గా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకులాల్లో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయగా అందులో రజనీకాంత్ ఒకరు.

సుధాకర్‌రెడ్డి



జఫర్‌గడ్, సెప్టెంబరు 4 : జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం తిడుగు ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయుడు కుందూరు సుధాకర్‌రెడ్డి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. హసన్‌పర్తి మండలం భైరాన్‌పల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి.. 2002లో ములుగు వెంకటాపూర్ మండలం బాహుసింగ్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా నియామకమయ్యారు. 2013లో జఫర్‌గడ్ మండలం కూనూరు ప్రాథమిక పాఠశాలలో పదేళ్ల పాటు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి.. ఇటీవల జులై నెలలో ఇదే మండలం తిడుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చారు.

అధ్యాపకుల విభాగంలో..

కేడీసీ కెమిస్ట్రీ అధ్యాపకుడు శ్రీనివాస్



కేయూ క్యాంపస్: హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ వాసం శ్రీనివాస్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. 22 ఏళ్ల బోధనానుభవం కలిగిన డాక్టర్ వాసం శ్రీనివాస్ విద్యారంగంలో అందించిన విశిష్ట సేవలకు అవార్డుకు ఎంపికయ్యారు. వరంగల్ జిల్లా సంగెం మండలకేంద్రానికి చెందిన శ్రీనివాస్.. 2002లో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై 2010లో పదోన్నతి ద్వారా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో నిర్వహిస్తున్నారు. గతంలో ములుగు, సిద్ధిపేట ప్రభుత్వకళాశాలల్లో పనిచేశారు. అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో సుమారు 31 పరిశోధన పత్రాలను ప్రచురించారు. తెలుగు అకాడమీ, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వర్సిటీల కెమిస్ట్రీ 11 పాఠ్యపుస్తకాలను ప్రచురించారు.

ఫిజిక్స్ ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి



కేయూ క్యాంపస్: కేయూ ఫిజిక్స్ సీనియర్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి ఈ ఏడాది రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. 35 ఏళ్ల సుదీర్ఘ బోధన, పరిశోధన అనుభవం కలిగిన బైరు వెంకట్రామిరెడ్డి ఫిజిక్స్ విభాగంలో విభాగాధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, వర్సిటీ రిజిస్ట్రార్‌గా, పరీక్షల నియంత్రణాధికారిగా, అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా, డీన్ అకడమిక్‌గా, వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్‌గానూ విశిష్ట సేవలందించారు. వరంగల్ జిల్లా పెద్దకోడెపాక గ్రామానికి చెందిన బైరు వెంకట్రామిరెడ్డి 1992లో కేయూ నుంచి ఫిజిక్స్ విభాగంలో పీహెచ్‌డీ డిగ్రీ పొందారు. 2003లో యూనివర్సిటీ పీజీ కళాశాల గోదావరిఖనిలో ఫిజిక్స్ అధ్యాపకులు ఉద్యోగ ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. 2018లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు.

తగ్గుతూ.. పెరుగుతూ...

గంట గంటకూ మారుతున్న గోదావరి ఉధృతి



మహదేవపూర్ మండలంలో అంతర్రాష్ట్ర వంతెన వద్ద గోదావరి ప్రవాహం

మహదేవపూర్, సెప్టెంబరు 4: మండలంలోని కాళేశ్వరంలో త్రివేణి సంగమం వద్ద గోదావరి ప్రవాహం కొనసాగుతోంది. నాలుగురోజుల వర్షానికి పుష్కర ఘాట్‌కు తాకుతూ ప్రవహిం చింది. మహారాష్ట్ర, తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలతో పాటు ప్రాజెక్టుల్లో గేట్లు ఎత్తివేయడంతో వరద భారీ ఎత్తు వచ్చి చేరింది. బుధవారం రాత్రి గోదావరి కాళేశ్వరం వద్ద 11.800 మీటర్ల ప్రవాహం కొనసాగింది.

• ఏటూరునాగారం రూరల్ : ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరదకు గోదావరి పరవళ్లు తొక్కుతోంది. మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద బుధవారం ఉదయం పెరిగిన ప్రవాహం మధ్యాహ్నానికి తగ్గుతూ వచ్చింది. పుష్కరఘాట్ వద్ద ఉదయం 8 గంటలకు 14.650 మీటర్ల నీటిమట్టం నమోదు కాగా మధ్యాహ్నం ఒంటి గంటలకు 14.670 మీటర్లకు చేరుకుంది. ఆ తర్వాత పుష్కరఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గింది. సాయంత్రం 6 పుష్కర ఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం 14.490 మీటర్లు ఉంది.

• వాజేడు: మండలంలో గోదావరి క్రమేణా తగ్గుముఖం పట్టింది. మంగళవారం ఉదయం 6గంటలకు 15.65 మీటర్లతో ఉన్న నీటిమట్టం పెరుగుతూ 8గంటలకు 15.81 మీటర్లుకు చేరుకొని నిలకడగా ప్రవహించింది. అనంతరం 10గంటలకు క్రమేణా తగ్గుతూ 15.79 మీటర్లు, 12గంటలకు 15.72 మీటర్లు, 2గంటలకు 15.60 మీటర్లు, 4గంటలకు 15.46 మీటర్లు సాయంత్రం 6గంటలకు 13.32 మీటర్లకు చేరుకుంది.

• కాటారం: మండలంలో మంగళవారం రాత్రి, బుధవారం కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. భారీ వర్షాలతో పాటు ఎగువన ఉన్న కడెం, శ్రీరాంసాగర్, శ్రీపాదఎల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి లక్షలాది క్యూసెక్కుల వరదనీటిని కిందకి వదిలేస్తుం డటంతో దామెరకుంట వద్ద గోదావరి, మానేరు నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షం ధాటికి లోతట్టు ప్రాంతాల్లోని వరి పొలాలు, పత్తి చేలన్నీ వరద నీటిలో మునిగి నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేని వర్షాలతో పత్తి పంట ఎర్రబారి ఎదుగుదల లేకుండా పోయి దిగుబడులపై ప్రభావం చూపతుందని ఆందోళన చెందుతున్నారు.

• మంగపేట: మండలంలోని కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్‌వెల్ వద్ద గోదావరి ప్రవాహం పెరుగుతూ తగ్గుతూ వస్తోంది. మంగళవారం 8 మీటర్ల 50 సెం.మీటర్లకు పెరిగిన బుధవారం సాయంత్రం 8 మీటర్లకు చేరింది.

• కన్నాయిగూడెం : మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి తగ్గుతూ పెరుగుతూ దోబూచులాడుతోంది. మంగళవారం ఉదయం వరకు పెరుగుతూ వచ్చిన గోదావరి సాయంత్రానికి స్వల్పంగా తగ్గుతూ ప్రవహించింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి మళ్లీ పెరిగింది. బుధవారం ఉదయానికి 9,08,340 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా మధ్యాహ్నం వరకు తగ్గుముఖం పట్టి 7,11,370 క్యూసెక్కులకు చేరింది. దీంతో మొత్తం 59 గేట్లు ఎత్తిన అధికారులు వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం నీటిమట్టం 81.80 మీటర్లు ఉంది.

అంతర్రాష్ట్ర రాకపోకలు షురూ



అంతర్రాష్ట్ర రహదారిపై నడుస్తున్న లారీలు

వాజేడు, సెప్టెంబరు 4: తెలంగాణ-చత్తీస్‌గఢ్‌కు మూడు రోజులుగా స్తంభించిన రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. 163వ జాతీయ రహదారి టేకులగుడెం వద్ద ఉన్న రేగుమాగు గండికి వరద ఉధృతి తగ్గడంతో బుధవారం సాయంత్రం నుంచి పోలీసులు రాకపోకలను పునరుద్ధరించారు. అడుగు లోతులో నీరు ప్రవహిస్తుండటంతో భారీ వాహనాలు మాత్రమే వెళ్లేందుకు అనుమతించారు. వాగు ఉధృతి కారణంగా మూడు రోజుల పాటు అటువైపు, ఇటువైపు సుమారు 100 వాహనాలకు పైగా నిలిచిపోయాయి. సరైన ఆహారం దొరక్క ప్రయాణికులు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సరిహద్దు అటవీ ప్రాంతం కావడంతో డ్రైవర్లు నానా అవస్థలు పడ్డారు. బుధవారం మధ్యాహ్నం ఉధృతి తుగ్గముఖం పడుతుండటంతో పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ పరిశీలించారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చిన అనంతరం వాహనాల రాకపోకలను షురూ చేశారు. దీంతో డ్రైవర్లు ఊపిరిపీల్చుకున్నారు.

ఆదివాసీ హక్కులను కాపాడాలి

తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు జనార్దన్

ఏటూరునాగారం, సెప్టెంబరు 4 : ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లోని ఆదివాసీ, గిరిజనుల హక్కులను కాపాడాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పట్టం జనార్దన్ అన్నారు. బుధవారం మండలంలోని శివాపురం గ్రామంలో తుడుందెబ్బ ముఖ్య కార్యకర్త సోలం సురేష్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణపై చర్చించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టబద్ధమైన హక్కులు గిరిజనులకే చెందాలని, వాటి పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతామన్నారు. పెసా చట్టాలను అమలు చేసి ఆదివాసీల భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. గిరిజనుల భూములను గిరిజనేతరులు లాక్కునే ప్రయత్నాలను వెంటనే ఆపివేయాలన్నారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ ఏటూరునాగారం డివిజన్ అధ్యక్షుడు కాపుల సమ్మయ్య, మండల ఉపాధ్యక్షుడు తాటి నీలాద్రి, మండల కార్యదర్శ తాటి సురేష్, పూనం నాగేశ్వరరావు, తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి కే చిరంజీవి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి : డీఎస్పీ

మేడారం, సెప్టెంబర్ 4: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ములుగు డీఎస్పీ రవీందర్ ఆకాంక్షించారు. తాడ్వాయి మండలం మేడారం గిరిజన బాలికల గురుకులంలో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన జీకే బుక్కుల పంపిణీ కార్యక్రమానికి డీఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు బుక్కులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థినులకు 250 జీకే పుస్తకాలను అందించామన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సాయిబాబా, ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కన్నుమూత



నర్సింహారెడ్డి (ఫైల్)

రేగొండ, సెప్టెంబరు 4: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ ఎడెల్లి నర్సింహారెడ్డి(94) అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. ఈయన 1973 నుంచి 1980 వరకు రంగయ్యపల్లి, రేగొండ గ్రామాలు ఉమ్మడిగా ఉన్నప్పుడు సర్పంచ్‌గా పని చేశారు. వృద్ధాప్య అనారోగ్య సమస్యలతో ఇంట్లోనే తుదిశ్వాస విడిచారు. నర్సింహారెడ్డికి భార్య కౌసల్య, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నర్సింహారెడ్డి మృత దేహానికి పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు శాంతిరెడ్డి, మోడెం ఉమేష్ గౌడ్, పున్నం రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గొర్లవీడు రామాలయ కమిటీ ఎన్నిక

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 4: మండలంలోని గొర్లవీడు గ్రామ దాశరథి రామాలయ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గ్రామంలోని కుల సంఘాల పెద్దలు, యువజన సంఘాలు, గ్రామస్థుల సమక్షంలో కమిటీని ఏకగ్రీవంగా ఆమోదించారు. అధ్యక్షుడిగా నలిమెల సదయ్య, ఉపాధ్యక్షు లుగా చాట్లపెల్లి రవికుమార్, బండారి రవి, నూకల ఓదేలు, బానోత్ శరీను, మేకల జీతన్, ప్రధాన కార్యదర్శులుగా మోతే రమేష్, ఆవునరి మహేందర్, నంగావత్ భాస్కర్ నాయక్, కౌటం బాలరాజు, కార్యదర్శులుగా ఎడ్ల చిరంజీవి, హట్కారి తిరుపతి, రాపాల సందీప్, సహాయ కార్యదర్శులుగా పెండెల కుమార్, అయిలాపురం రాంబాబు, తూపుకారి దేవేందర్, ప్రచార కార్యదర్శులుగా రావుల శంకర్, భాస్కరి కమలాకర్, అలుగం దేవేందర్, కోశాధికారిగా రంగు రవీందర్‌తో పాటు 25 మంది సలహాదారులు, 11 మంది కార్యవర్గ సభ్యులు, 10 మంది మహిళా సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

కాకతీయఖని, సెప్టెంబరు 4: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సింగరేణి భూపాలపల్లి ఏరియాలో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-2,3లలో బొగ్గు ఉత్పత్తికి ఏర్పడిన అంతరాయం కొనసాగుతోంది. రహదారులు బురదమయం కావడంతో యంత్రాలు కదలలేని పరిస్థితి నెలకొంది. క్వారీల్లో వర్షపు నీరు నిలవడంతో బొగ్గు వెలికి తీయడం సాధ్యపడలేదని ఏరియా సింగరేణి అధికారులు తెలిపారు. గడిచిన మూడు రోజుల్లో వర్ష ప్రభావంతో ఓసీ-2,3 ప్రాజెక్ట్ నుంచి సుమారు 33 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగిందని తెలిపారు. దీంతో సింగరేణికి సుమారు రూ. రూ.115 కోట్లు నష్టం వచ్చిందని అధికారులు చెబుతున్నారు.

28న జాతీయ లోక్‌అదాలత్

జిల్లా జడ్జి నారాయణబాబు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి నారాయణబాబు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 4: జాతీయ లోక్‌అదాలత్‌ను ఈనెల 28న నిర్వహించనున్నట్లు జిల్లా జడ్జి పి.నారాయణబాబు తెలిపారు. జిల్లా కోర్టులో న్యాయవాదులతో కలిసి ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమనే నినాదాన్ని ప్రజల్లో నింపాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. చిన్నచిన్న సమస్యలను పెద్దవి చేసుకొని పంతాలకు పోయి కేసుల్లో ఇరికితే నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జయరాంరెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎన్. రామచంద్రారావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 4: పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ములుకలపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆశాడపు ఐలుమల్లు(70) కొంతకాలంగా షుగర్‌వ్యాధితో బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఎడమకాలికి గాయం కావడంతో వైద్యులు సర్జరీ చేసి తొలగించారు. అప్పటి నుంచి ఇబ్బందులు పడుతున్న ఐలుమల్లు జీవితంపై విరక్తిచెంది మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

బొగతను సందర్శించిన పీసీసీఎఫ్



బొగత జలపాతం వద్ద పీసీసీఎఫ్ దోబ్రియాల్

వాజేడు, సెప్టెంబరు 4: ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్)డోబ్రియాల్ బుధ వారం బొగత జలపాతాన్ని సందర్శించారు. జిల్లాలోని తాడ్వాయి-మే డారం మధ్య ఇటీవల సుడిగాలులకు నేలమట్టమైన వృక్షాలను పరిశీలిం చేందుకు వచ్చిన ఆయన మధ్యాహ్నం బొగత వద్దకు వచ్చారు. జలపాతం అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. జలపాతం వద్ద చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. జలపాతం ముందు భాగంలో నిర్మించిన రాతికట్టను పరిశీలించి పలు సూచనలు చేశారు. జలపాతం సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. రాష్ట్రంలోనే ప్రధాన పర్యటక ప్రాంతంగా ఉన్న నేపథ్యంలో పర్యాటకులను ఆకర్షించేలా బొగత జలపాతం ప్రదేశాన్ని తీర్చిదిద్దాలన్నారు. ప్రస్తుతం సందర్శనను మూసివేయడంపై ఆరా తీశారు. ఆయన వెంట వరంగల్, భద్రాద్రి కొత్తగుడెం రేంజ్ సీఎఫ్‌లు ప్రభాకర్, భీమానాయక్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా సబ్ కలెక్టర్ కార్యాలయం

కాటారం, సెప్టెంబరు 4: మండల కేంద్రంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. వైటీసీలోని ఐదు గదులను సబ్ కలెక్టర్ కార్యాలయం కోసం కేటాయించగా వివిధ శాఖల అధికారులు దగ్గరుండి మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ మరమ్మతులు చేయిస్తూ సర్వాంగసుందరంగా రూపుదిద్దుకునేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వం రెండు నెలల క్రితం కాటారం రెవెన్యూ డివిజన్‌ను అప్‌గ్రేడ్ చేసి సబ్ కలెక్టర్ హోదా కల్పించింది. ఇటీవల 2022 ట్రైనీ బ్యాచ్ ఐఏఎస్ అధికారి మయాంక్‌సింగ్‌ను కాటారం సబ్ కలెక్టర్‌గా సీఎస్ శాంతికుమారి నియమించారు. దీంతో కలెక్టర్ రాహుల్‌శర్మ వైటీసీని ఇటీవల సందర్శించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఏర్పాటుకు కావాల్సిన సౌకర్యాలు, చేపట్టాల్సిన మరమ్మతులపై ఆరా తీశారు. ఐటీడీఏ ద్వారా నిధులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. గురువారం మయాంక్‌సింగ్ జిల్లాకేంద్రంలో జాయినై శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అడుగు పెట్టనున్నట్లు సమాచారం. కార్యాలయ పనులను బుధవారం తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, ఐటీడీఏ ఇంజనీర్లు పరిశీలించారు.

ఇసుక క్వారీలో అదనపు బకెట్ దందా?

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 4 : పలిమెల మండల పరిధిలోని పంకెన ఇసుక క్వారీలో అదనపు ఇసుక బకెట్ దందా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో బకెట్‌కు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో లారీ నుంచి సుమారుగా రెండు నుంచి మూడు బకెట్ల వరకు అదనంగా వేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు తెలిసింది. భారీ వానలు, వరదల నేపథ్యంలో అధికారులంతా బిజీబిజీగా ఉండటంతో క్వారీ నిర్వాహకులు ఈ దందాకు తెరలేపినట్లు సమాచారం. అదనపు బకెట్‌తో పాటు లారీ పాసింగ్ కోసం ప్రత్యేకంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వానలు లేనప్పుడు కూడా ఈక్వారీలో అదనపు వసూళ్లు చేస్తున్నట్లు తెలిసింది. ఈవిషయమై స్థానిక పీవోను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. శాఖపరమైన తనిఖీలు లేకపోవడంతో క్వారీలో అదనపు దందా అడ్డూ అదుపు లేకుండా పోతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి

టీజీఎన్పీడీసీఎల్ ఎస్ఈ మల్హూర్ నాయక్

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 4: భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని టీజీఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ మల్హూర్ నాయక్ పేర్కొన్నారు. ఈ నెల 4 నుంచి 9వరకు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని బుధవారం ఆయన ఒక ప్రకటనలో సూచించారు. వర్షాలు కురుస్తుండగా తడిచిన విద్యుత్ స్తంభాల వద్ద ఉండకూడదని, వాటిని తాకకూడదని పేర్కొన్నారు. అలాగే తడిచిన విద్యుత్ ఉపకరణాలను తాకకూడదని, తెగిపడిన, వేలాడుతున్న, కిందకు ఉన్న తీగల వద్దకు వెళ్లకూడదని సూచించారు. ఇలాంటి ఏవైనా దృశ్యాలు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. ఇనుప దండెం, రేకులు విద్యుత్ తీగలకు తాకుతున్న విషయాన్ని గమనించాలని, వాటిని ఎట్టి పరిస్థితిలోనూ తాకకూడదని పేర్కొన్నారు. కరెంటు మోటార్లనుగానీ, ఫుట్ వాల్వ్‌లను తాకొద్దని, పశువులను ట్రాన్స్‌ఫార్మర్లకు వద్దకు తీసుకువెళ్లకూడదని, సర్వీస్ తీగలకు అతుకులు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఇంకా ఇతరత్ర సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 18004250028 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బైక్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు.. ఒకరికి గాయాలు

కాటారం, సెప్టెంబరు 4:మండలంలోని కొత్తపల్లి-బస్వాపూర్ మధ్య 353(సీ)జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన తోటపల్లి రాజేష్ అనే యువకుడు గాయాల పాలయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రైవేట్ హన్మకొండ నుంచి ట్రావెల్స్ బస్సు కాళేశ్వరం వస్తుండగా రోడ్డు అంచున ఆగి ఉన్న బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై కూర్చొని ఉన్న రాజేష్ ఎగిరి రోడ్డు పక్కనపడటంతో గాయాలయ్యాయి. ప్రమాద సంఘటనలో బస్సు ముందు భాగం, బైక్ ధ్వంసమయ్యాయి. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

గ్రామాల్లో బడే నాగజ్యోతి పర్యటన

మంగపేట, సెప్టెంబరు 4: ములుగు జడ్పీ మాజీ చైర్‌ పర్సన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి మండలంలో బుధవారం పర్యటించారు. బ్రాహ్మణపల్లిలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పాండ శ్రీను కుమార్తె ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేలు ఆర్థికసాయం అందించారు. వాడగూడెంలో చిక్కుల రమణ ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేలు, కత్తిగూడెంలో ఇమ్మడి ఎల్లయ్య ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి రూ. 2 వేలు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న అకినేపల్లి-మల్లారం గ్రామా నికి చెందిన దొడ్డ ప్రశాంత్‌ను, కొత్తమల్లూరుకు చెందిన రెబ్బల రామును, తిమ్మంపేటకు చెందిన బోడ ప్రవీణ్‌ను పరామర్శించారు. కార్యకర్తలకు బీఆర్ఎస్ ఎప్పటికీ అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని అన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుడు ముల లక్ష్మీనారాయణ, రాజుయాదవ్, మంగపేట హకార సంఘం చైర్మన్ తోట రమేష్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఎడ్లపెల్లి నర్సింహారావు, చిలుకమర్రి రాజేందర్, కొమరం ధనలక్ష్మీ, సహకార సంఘం డైరెక్టర్లు సిద్దంశెట్టి లక్ష్మణ్‌రా వుగుప్తా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మలికంటి శంకర్, తిరుపతి, సురేందర్, మూర్తి, శోభన్, జి.రమేష్, భద్రయ్య, సుదర్శన్, శ్రీను, సాంబు తదితరులు ఉన్నారు.

కాటారానికి బీసీ బాలుర గురుకులం

పెద్దపల్లి జిల్లా వెంకటాపూర్ నుంచి షిఫ్ట్



కాటారం, సెప్టెంబరు 4: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకులం ఎట్టకేలకు కాటారం మండలానికి తరలివచ్చింది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం వెంకటాపూర్ నుంచి బుధవారం మండల కేంద్రానికి మారింది. విద్యార్థులు, ఉపా ధ్యాయులు, సిబ్బందితో పాటు సామగ్రి రావడంతో గురువారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. 2018లో కాటారం మండలానికి మంజూరైన బీసీ సంక్షేమ గురుకులాన్ని వసతులున్న భవనం లేక పెద్దపల్లి జిల్లా మంథని మండలం వెంకటాపూర్‌లో 2019లో ప్రారంభించారు. గతేడాది నుంచి భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు భయందోళన వ్యక్తం చేశారు. అధికారులు గురుకులాన్ని రామగుండానికి షిఫ్ట్ చేయడానికి యత్నించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి మండల కేంద్రానికి బీసీ గురుకులాన్ని తరలించాలని ఆదేశించారు. ఓ ప్రైవేట్ విద్యా సంస్థను నడిపిన భవనాన్ని అద్దెకు తీసుకొని గురుకులాన్ని నడిపించడానికి చర్యలు చేపట్టారు. 165 మంది విద్యార్థులతో స్థానికంగా రన్ కానున్నది. వచ్చే ఏడాది నుంచి పూర్తి స్థాయిలో గురుకులంలో సీట్ల భర్తీ చేయనున్నట్లు ఇన్‌చార్జి వేణుగోపాల్ తెలిపారు.

చలివాగు వంతెన పునఃప్రారంభం



బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

టేకుమట్ల, సెప్టెంబరు 4 : టేకుమట్ల, రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య చలివాగుపై పునఃనిర్మాణమైన వంతెనను బుధవారం కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతేడాది కురిసిన భారీ వర్షాలకు టేకుమట్ల, రాఘవరెడ్డిపేట వంతెన పిల్లర్లు కుంగినట్లు తెలిపారు. యుద్ధ ప్రాతిపాదికన వంతెన పునఃనిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. తక్కువ సమయంలో వంతెన నిర్మాణం పూర్తి చేసిన గుత్తేదారుకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. వంతెన నిర్మాణంతో వాగు అవతలి వైపు ఉన్న పది గ్రామాలకు మార్గం సుగమం అయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే మండలంలో 15 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

గణేష్ ఉత్సవాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి : డీఎస్పీ

మహదేవపూర్, సెప్టెంబరు 4 : చవితి సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతియుతంగా, భద్రత వాతావరణంలో వినాయక చవితి, నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. అందరూ విధిగా సంబంధిత వెబ్‌సైట్‌లో విగ్రహం ఎత్తు, నిమజ్జన సమయం, తేదీ ప్రదేశం, ఇతర వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపరచాలన్నారు. విగ్రహం మండపం వద్ద నిత్యం ఇద్దరు పెద్దలు అందుబాటులో ఉండాలన్నారు. ఎటువంటి డీజేలకు పర్మిషన్ లేదని, అలాగే మైకులు లేదా బ్యాండులు పెట్టదలచుకుంటే కచ్చితంగా పర్మిషన్ తీసుకోవాలన్నారు. రాత్రి సమయంలో పెద్ద పెద్ద సౌండ్‌లు పెట్టవద్దని, ఇతర విగ్రహ మండప నిర్వాహకులతో గొడవలు పెట్టుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్, సీఐ రామచందర్‌రావు పాల్గొన్నారు.

ఆయుష్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

తాడ్వాయి, సెప్టెంబరు 4: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం ఆయుష్ వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ సుశ్వేత గ్రామస్థులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆమె సూచించారు. శిబిరంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఎన్‌లీ చంద్ర, ఫార్మాసిస్టు మనీషా, సిబ్బంది డీ సమ్మయ్య, ఎమ్డీ రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 4: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన చిత్తుబొత్తుల స్వరూప ఇల్లు కూలిపోయింది. కాంగ్రెస్ నాయకులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్‌లు బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో కాలువిరిగిన కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీధర్‌ను పరామర్శించి రూ.2వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముడిగడుపుల సాంబయ్య, బొచ్చు సమ్మయ్య, శంకర్, చిగురు రంగారావు, కుమారస్వామి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన వృక్షాల పరిశీలన

తాడ్వాయి, సెప్టెంబరు 4: శనివారం కురిసిన భారీ వర్షంతో తాడ్వాయి-మేడారం మధ్యలోని అడవిలో సుమారు 500 ఎకరాల్లో కూలిపోయిన వృక్షసంపదను బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ విపత్తు విధ్వంసంలో లక్ష చెట్లు విరిగిపడడం దురదృష్టకరమన్నారు. దీనికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పరిశోధనలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బర్తపురం నరేష్, శీలమంతుల రవీంద్రాచారి, జాడి వెంకట్, జినుకల కృష్ణాకర్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, ద్యాగల సలేందర్, తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్‌కు సన్మానం

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 4: ములుగు అడిషనల్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన ఎం.సంపత్‌రావును టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పోలు రాజు ఆధ్వర్యంలో అధికారులు ఉద్యోగులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ ములుగు జిల్లా అభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని, ప్రజలకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా కార్యదర్శి మేడి చైతన్య, నాయకులు కుమారస్వామి, గడ్డం రమాదేవి, ఎం అనిల్‌కుమార్, ప్రదీప్, రాంగోపాల్, ఎం రమేష్, అనిల్‌కుమార్, శ్రీవాణి, శ్రావ్య, నిరంజన్‌రెడ్డి, నర్సయ్య, పరంసింగ్, కోటేశ్వర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ మాసోత్సవం

కన్నాయిగూడెం, సెప్టెంబరు 4: మండలంలోని లక్ష్మీపురం, ముప్పనపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్ మాసోత్సవాన్ని బుధవారం ఏటూరునాగారం ఐసీడీఎస్ సీడీపీవో ప్రేమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు 1000 రోజుల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పవతి, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర వైద్య సేవలు అందించాలి

మంగపేట, సెప్టెంబరు 4: వర్షాకాలం దృష్ట్యా వైద్య సిబ్బంది రోగులకు నిరంతర సేవలు అందించాలని డీఎంహెచ్‌వో అప్పయ్య అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, చుంచుపల్లి, మంగపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. అనంతరం దోమేడ, నిమ్మగూడెం, తోగ్గుగూడెం, చింతకుంట, తక్కళ్లగూడెం, సంగంపల్లి, రామచంద్రునిపేట, రాజుపేట, రమణక్కపేట, వాడగూడెం, పాలాయిగూడెం, చుంచుపల్లి, కొత్తమల్లూరు, మల్లూరు, బోరునర్సాపురం, మంగపేట, కమలాపురం తదితర గ్రామాల్లో మురికి గుంతలను పరిశీలించారు. ప్రజలకు ఆరోగ్య సూచనలను ఇచ్చారు. ఆయా ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. వైద్యులు నిఖిల్‌కుమార్, యమున, వైశాలి, దవాఖాన వైద్యులు పాల్గొన్నారు.